# తెలంగాణ వీణ

నిజం నిగ్గు తేలుద్దాం..

https://epaper.telanganaveena.com/

DYNAMIC 5:00PM

శనివారం /03.03.2024





## కంటోన్మెంట్ భూముల అప్పగింత

**తెలంగాణవీణ,హైదరాబాద్ :**


సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న వేళ.. తెలంగాణ ప్రజలకు కేంద్ర ప్రభుత్వం శుభవార్త చెప్పింది. సికింద్రాబాద్ కంటోన్మెంట్ పరిధిలో రక్షణశాఖకు చెందిన భూమిని తెలంగాణ ప్రభుత్వానికి బదిలీ చేసింది. ఈ మేరకు 175 ఎకరాల భూమిని బదిలీ చేస్తున్నట్లు ఉత్తర్వులు జారీ చేసింది. ఈ విషయాన్ని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి వెల్లడించారు. తన ట్విటర్ ఖాతా ద్వారా ఈ విషయాన్ని తెలిపిన కిషన్ రెడ్డి..ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. మౌలిక వసతుల కల్పన ద్వారా ప్రజల జీవితాన్ని సులభతరం చేసేందుకు ప్రధాని మోదీ చేస్తున్న కృషికి, హామీల అమల్లో చిత్తశుద్ధికి ఇదో ఉదాహరణ అంటూ కిషన్ రెడ్డి అభివర్ణించారు.కేంద్ర ప్రభుత్వం సికింద్రాబాద్ కంటోన్మెంట్ పరిధిలోని 175 ఎకరాల భూమిని రాష్ట్ర ప్రభుత్వానికి బదలాయించిందన్న కిషన్ రెడ్డి.. ఈ నిర్ణయం ద్వారా రోడ్లు, ఎలివేటెడ్ కారిడార్లు, టన్నెళ్ల నిర్మాణానికి ఇబ్బందులు తప్పుతాయని అన్నారు. నిజామాబాద్ వైపు వెళ్లే 44వ నంబర్ జాతీయ రహదారి, కరీంనగర్ వైపు వెళ్లే రాష్ట్ర రహదారిపై ప్రయాణించే వారికి కేంద్రం నిర్ణయం ద్వారా ప్రయోజనం ఉంటుందని కిషన్ రెడ్డి ట్వీట్ చేశారు.

### రామేశ్వరం కేఫ్ పేలుడు కేసులో

## పోలీసుల అదుపులో నలుగురు

**తెలంగాణవీణ,జాతీయం :**





కర్ణాటక బెంగళూరులోని రామేశ్వరం కేఫ్‌లో జరిగిన పేలుళ్ల కేసులో నలుగురిని అదుపులోకి తీసుకున్నట్లు పోలీసు వర్గాలు తెలిపాయి. వారిని విచారిస్తున్నట్లు పేర్కొన్నాయి. పేలుడు ఘటనపై దర్యాప్తు ముమ్మరంగా సాగుతోందని బెంగళూరు నగర కమిషనర్ బీ దయానంద తెలిపారు. ఈ కేసుపై పోలీసులు బృందాలుగా ఏర్పడి దర్యాప్తు చేపడుతున్నారని చెప్పారు. కేసు సున్నితత్వం, భద్రతా సమస్యలను దృష్టిలో ఉంచుకుని మీడియా సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఎటువంటి ఊహాగానాలకు తావు ఇవ్వొద్దని కోరారు. మరోవైపు, కెంపెగౌడ అంతర్జాతీయ విమానాశ్రయంలో భద్రతను మరింత కట్టుదిట్టం చేశారు అధికారులు.

**'నిందితులను వీలైనంత త్వరగా పట్టుకుంటాం'**

రామేశ్వరం కేఫ్‌లో జరిగిన పేలుడుకు కారణమైన నిందితులను వీలైనంత త్వరగా పట్టుకుంటామని కర్ణాటక సీఎం సిద్ధరామయ్య తెలిపారు. సీసీటీవీ ఆధారంగా ఘటన వెనుక ఉన్న వారిని పట్టుకుంటామని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. అలాగే పేలుడు సంభవించిన రామేశ్వరం కేఫ్‌ను కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య శనివారం సందర్శించారు. ఆ తర్వాత పేలుడు ఘటనలో గాయపడి బ్రూక్‌ఫీల్డ్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నవారిని పరామర్శించారు.

## జగన్ పై సంచలన ఆరోపణలు చేసిన టీడీపీ ఎమ్మెల్యే

- వివేకా హత్య కేసులో సీఎం పాత్ర ఉంది
- అందుకే దర్యాప్తునకు ఆటంకం కలిగిస్తున్నాడని విమర్శ
- ప్రభుత్వ భూములను వైసీపీ నేతలు కబ్జా చేస్తున్నారని మండిపాటు

**తెలంగాణవీణ,ఏపీ బ్యూరో :**



ఆంధ్రప్రదేశ్ మాజీ మంత్రి వివేకానంద హత్య కేసులో సీఎం జగన్ పాత్ర ఉందంటూ గోరంట్ల బుచ్చయ్య చౌదరి తీవ్ర ఆరోపణలు చేశారు. వివేకా హత్యకు కుట్రలో జగన్ హస్తం ఉందని, అందుకే కేసు దర్యాప్తునకు ఆటంకం కలిగిస్తున్నాడని సంచలన వ్యాఖ్యలు చేశారు. ఈమేరకు టీడీపీ సీనియర్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి శనివారం మీడియాతో మాట్లాడుతూ.. సొంత చెల్లెలికే న్యాయం చేయని వ్యక్తి ప్రజలకు మాత్రం ఏం చేస్తాడంటూ ప్రశ్నించారు. బాబాయ్ హత్య కేసు విచారణను అడ్డుకుంటున్నాడని జగన్ పై ఆరోపణలు గుప్పించారు. అధికారాన్ని అడ్డుపెట్టుకుని రాష్ట్రంలో వైసీపీ నేతలు, కార్యకర్తలు చేస్తున్న అవినీతికి అంతేలేకుండా పోతోందని గోరంట్ల ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ భూములను కబ్జా చేసి ప్రైవేటు వ్యక్తులకు అమ్మేస్తున్నారని తీవ్రంగా మండిపడ్డారు. వాలంటీర్ వ్యవస్థను దుర్వినియోగం చేస్తున్నారని, అధికార యంత్రాంగంతో రాజకీయ ప్రచారం చేయిస్తున్నారని విమర్శించారు. రాజమండ్రి కేంద్రంగా ఇసుక దందా చేస్తున్నారని, బ్యారేజ్ కింద ఇసుక మొత్తం తవ్వేస్తున్నారని చెప్పారు. ఇసుక మాఫియా ద్వారా రోజుకు రెండు కోట్లు దోచుకుని దాచుకుంటున్నారని ఆరోపించారు. వైసీపీ నేతల ధన దాహానికి రాజమండ్రి బ్యారేజ్ కు ముప్పు పొంచి ఉందని గోరంట్ల బుచ్చయ్య చౌదరి ఆందోళన వ్యక్తం చేశారు.

## మల్లారెడ్డికి హెచ్ఎండీఏ షాక్..

* మాజీ మంత్రి మల్లారెడ్డి షాక్
* కాలేజీ రోడ్డును తొలగించిన హెచ్ఎండీఏ అధికారులు
* గతంలో ఫిర్యాదు చేసిన రేవంత్ రెడ్డి



**తెలంగాణవీణ,హైదరాబాద్ :**

బీఆర్ఎస్ మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డికి అధికారులు బిగ్ షాకిచ్చారు. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని హెచ్ఎండీఏ లేఅవుట్లో 2500 గజాల స్థలం ఆక్రమించి ఆయన కాలేజీ కోసం మల్లారెడ్డి రోడ్డు వేసుకున్నట్లు తీవ్ర ఆరోపణలు ఉన్నాయి. దీనిపై గతంలో మేడ్చల్ మల్కాజిగిరి ఎంపీగా ఉన్న ప్రస్తుత సీఎం రేవంత్ రెడ్డి అప్పట్లో అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు హెచ్ఎండీఏ స్థలం ఆక్రమణపై మేడ్చల్ కలెక్టర్ దృష్టి పెట్టారు. హెచ్ఎండీఏ లేఅవుట్లో అక్రమంగా ఏర్పాటు చేసిన రోడ్డును తొలగించాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. కలెక్టర్ ఆదేశాలతో మల్లారెడ్డి కాలేజీ కోసం వేసిన రోడ్డును అధికారులు తాజాగా తొలగించారు

**అధికారం వాళ్ల చేతుల్లో ఉంది కాబట్టి ఏమైనా చేస్తారు : మాజీ మంత్రి మల్లారెడ్డి**

- ప్రభుత్వం కక్ష సాధింపు చర్య... కావాలనే నన్ను టార్గెట్ చేశారు
- హెచ్ఎండీఏ అధికారుల అనుమతి తీసుకొని అప్పుడు కాలేజీ కోసం రోడ్డు వేసినట్లు వెల్లడి
- 2,500 గజాల రోడ్డు స్థలానికి గాను ప్రత్యామ్నాయ స్థలం ఇచ్చినట్లు వెల్లడి

## టీడీపీలో చేరిన వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి దంపతులు..

### మాజీ మంత్రి అనిల్ బాబాయికి పసుపు కండువా!

* నెల్లూరు జిల్లాలో వైఎస్సార్‌సీపీకి షాక్
* టీడీపీలో చేరిన వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి
* పార్టీలో చేరిన మాజీ మంత్రి అనిల్ బాబాయి



**తెలంగాణవీణ,ఏపీ బ్యూరో :**

నెల్లూరు జిల్లాలో వైఎస్సార్‌సీపీకి ఎదురు దెబ్బ తగిలింది. ఆ పార్టీ రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ప్రశాంతి రెడ్డి దంపతులు టీడీపీలో చేరారు. ఆయనతో పాటు నెల్లూరు డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్ యాదవ్, పలువురు వైఎస్సార్‌సీపీ నేతలు చంద్రబాబు సమక్షంలో పార్టీలో చేరారు. పీవీఆర్ కన్వెన్షన్‌లో నిర్వహించిన చేరికల సభకు కార్యకర్తలు పెద్దఎత్తున తరలివచ్చారు. వైఎస్సార్‌సీపీ నుంచి వచ్చి నేతలకు పసుపు కండువాలు కప్పి పార్టీలోకి స్వాగతం పలికారు. టీడీపీలో చేరడం ఎంతో ఆనందంగా ఉందన్నారు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి. తాను ప్రత్యక్ష రాజకీయాల్లోకి రావాలని నిర్ణయం తీసుకున్నానని.. నెల్లూరు లోక్‌సభ స్థానం నుంచి పోటీ చేయబోతున్నట్లు ప్రకటించారు. తనను ఆశీర్వదించి గెలిపించాలని కోరారు.